# జీవితంలో... ★

రచన:
శ్రీ విజయభాస్కర్.

మనిషి జీవితంలో ఎన్నో తప్పులు చేస్తుంటాడు. తప్పు చేయని మనిషంటు ఉండడు. అలాగని ఎదుటి వ్యక్తిలోని తప్పుల్ని ఎంచకుండా ఉండడమని కాదు. తప్పుల్ని ఎంచాలి. వాళ్ళు చేసిన తప్పెలాంటిది. అది ఎలాంటి పరిస్థితుల్లో చేయబడింది. వీటిని సూక్ష్మంగా పరిశీలించాలి. విధి వంచితులై ఆ తప్పు చేశారా? లేక మనస్ఫూర్తిగా కావాలని చేశారా? వీటిని గుర్తించక మనం తొందర పడితే ముందు మన మూర్ఖత్వమే బయట పడుతుంది. అంటే మనం మరో తప్పు చేస్తున్నామన్న మాటే!

శ్రీనాథ్ జీవితంలో ఇలాంటి సమస్యే తటస్థించింది. శ్రీనాథ్ యం. బి. బి. యస్. చదివాడు. తెలివైనవాడు. దానికి తోడు మగాళ్ళకే ఈర్ష్య కలిగించేటంతటి అందగాడు. కాలేజీలో చదివే రోజుల్లో అతని స్నేహం కోసం ప్రాకులాడని ఆడపిల్లలు లేరు. అలాగని అతడు వెర్రి వెర్రి వేశాలు వేసేవాడు కాదు. బుద్ధిగా చదువుకునే వాడు. ఆడపిల్లలెప్పుడైనా కావాలని పనికల్పించుకుని మాట్లాడడానికి వచ్చినప్పటికిని వాళ్ళను అవమాన పరిచే వాడు కాదు. వాళ్ళకు నచ్చే విధంగా సౌమ్యంగా మాట్లాడి సమాధాన పరిచేవాడు. దానికే ఆ అమ్మాయిలు మహా భాగ్యంగా భావించేవారు. ఆ అమ్మాయిలు అతనితో మాట్లాడామని, తోటివాళ్ళతో గర్వంగా చెప్పుకునేవారు. శ్రీనాథ్ గురించి అంత గర్వంగా చెప్పుకోవడం ఇందిరకు ఎచ్చెట్టుగా తోచేది.

శ్రీనాథ్ అంటే గిట్టని రాజారావు, ఇందిరను ప్రోత్సహిస్తూ శ్రీనాథ్ గురించి చెడుగా చెప్పేవాడు. అది ఇందిరకు ఎంతో సంతోషాన్ని కలిగించేది. ఇందిరకూడా అప్పుడప్పుడు తన స్నేహితురాళ్ళతో శ్రీనాద్ గురించి చెడుగా చెప్పేది. వాళ్ళకు తెలుసు శ్రీనాద్ అందమంటే ఈర్ష్య అని. నిజానికి ఇంత ఈర్ష్య ఒక మగాడిపై అకారణంగా ఉందంటే లోన ఎంతో ప్రేమ దాగుందని చెప్పాలి. నిజానికి చెప్పాలంటే ఇందిర ఎప్పుడూ శ్రీనాద్ గురించే ఆలోచిస్తూ ఉండేది. తనూ ఇంత అందగత్తె కదా! కాలేజీలో నాకోసం నా స్నేహం కోసం ఎందరో అబ్బాయిలు తహతహ లాడతారు. అలాంటిది ఈ అపర మన్మధుడు శ్రీనాద్ నన్ను కన్నెత్తెయినా చూడడు. అదే ఇందిరకు ఆశ్చర్యాన్ని ఈర్ష్యనూ కలిగిస్తుండేది. దీనికి తోడు రాజారావుకు శ్రీనాద్ అంటే గిట్టని కారణంగా ఇందిర రాజారావుల స్నేహం దినదిన ప్రవర్థమానమవసాగింది. కాలేజీలో విద్యార్థులు మొదలుకొని లెక్చరర్స్ వరకు శ్రీనాద్ అంటే గిట్టని కారణంగా ఇందిర రాజారావులు స్నేహితులుగా మారారని అనుకుంటారు.

ఈ విషయం శ్రీనాద్‌కు కూడా తెలుసు. ఆ ఆలోచన వచ్చినపుడూ అతని ముఖం పై కల్మషంలేని చిరునవ్వు వెలిగేది. ఆ చిరునవ్వే ఇందిర హృదయాన్ని కాల్చివేసేది. బహుశా అది అంత అందమయిన చిరునవ్వు కావడమే కారణమేమో?

ఏది ఏమయినప్పటికిని ఇందిర మాత్రం ప్రత్యక్షంగా శ్రీనాద్‌కు విరోధే! పరోక్షంగా ఆమె మనసుకే తెలియాలి, లేదా ఒక వేళ లోన ప్రేమిస్తూ అయినా ఉండాలి.

కాలచక్రంలో రోజులు, నెలలూ, సంవత్సరాలూ దొర్లిపోతున్నాయి. ఇలాగే ఇందిరా, రాజారావుల స్నేహం ప్రణయంగా మారింది. వీళ్ళనుడికించడానికన్నట్టు కాలేజీ అమ్మాయిలంతా శ్రీనాద్‌ని దేవునిగా, ప్రియునిగా, పూజించేవారు. కొందరు సిగ్గు, లజ్జ లేకుండా పదిమందిలోనూ శ్రీనాద్ అందాలను వర్ణించేవారు. ఇదే ఇందిరా, రాజారావుల ప్రణయానికి నాంది పలికింది. ఇందిరా రాజారావుల ప్రణయ విషయాలు అందరికి తెలిసినా గోడలపై వాళ్ళ పేర్లు, బొమ్మలు గీచే అంతటి దుస్థితికి దిగజారలేదు ఆ కాలేజీ పిల్లలు.

కథ ఇంతటితో ఆగలేదు. వీరిప్రణయం పక్వానికి వచ్చేదశలోనే రాజారావు వాళ్ళ తండ్రికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. రాజారావు చేసేది లేక ఇందిరను కలుసుకుని టాటా చెప్పాడు. చివరిసారిగా బాధపడి, రెండు కన్నీటి బొట్లు అతని పాదాలపై జారవిడిచింది. బహుశా శ్రీనాద్ అంటే గిట్టని వ్యక్తులు తనకు తారస

పడరేమో అని కాబోలు. ఆమె విచారవదనం చూసి కాలేజీలో అందరూ జాలిపడ్డారు. వాళ్ళ జాలి ఆమెను పుండు మీద కారం చల్లినట్లు అనిపించేది.

శ్రీనాద్ మాత్రం ఈ విషయాలేమీ అంతగా పట్టించుకునే వాడు కాడు. కాని, అప్పుడప్పుడు ఇందిరకు కనిపించేలా తనకు తానే స్టైల్ మేంటైన్ చేసుకుంటు నడిచేవాడు. కాని ఇందిర ముఖం మాత్రం చూచేవాడు కాదు. బహుషా ఇతనికీ ఇందిరమీద ప్రేమ ఉందేమో! ఇదోరకం ఆకర్షణా ప్రణయం కాబోలు.

శ్రీనాద్ తండ్రి ఉత్తరం వ్రాశాడు. శ్రీనాద్ పెళ్ళి గురించి. దానితో పాటు అమ్మాయి ఫోటో కూడా పంపాడు. నీకిష్టమయితే వెంటనే జవాబు వ్రాయి అని కూడా వ్రాశాడు. ఆమె చదువు మొదలగు వివరాలేమీ వ్రాయలేదు. ఆ ఫోటో ఇందిరది.

ఒక్కసారిగా ఆలోచనలో పడిపోయాడు. ఇందిర, రాజారావుల ప్రణయగాథ అతనికళ్ళ ముందు కదలాడసాగింది. ఎంతయినా తనూ మనిషే కదా! ఇందిరను వివాహమాడటానికి అతనికి మనసువొప్పలేదు. తను తండ్రికి ఉత్తరం వ్రాయలేదు. తటస్థంగా ఉండిపోయాడు.

మళ్ళీ ఉత్తరమొచ్చింది తండ్రి దగ్గరనుండి. నీవు ఏ విషయమూ తెలుపక పోతే వాళ్ళు అమ్మాయికి వేరే సంబధం చూసుకుంటారట అని వ్రాశాడు.

ఒక అప్సరస చేజారిపోతోందన్న బాధ, లోలోన ఏదో కుళ్ళు (అదే ఇందిరా రాజారావుల ప్రణయం) ఎలాగయితేనేం చివరకు ఇందిరను వివాహమాడతానని తండ్రికి ఉత్తరం వ్రాశాడు.

ఇతనికి తండ్రి దగ్గరనుండి పెళ్ళికి సంబంధించిన ఉత్తరం వచ్చినట్టుగానే ఇందిరకూ ఉత్తరం వచ్చింది. కూడా అబ్బాయి ఫోటో ఉంది. ముందు ఇందిరకూడా శ్రీనాద్‌లాగే తటపటాయించింది. శ్రీనాద్ అందగాడే, అందరి అమ్మాయిలతో ఆరాధింపబడుతున్న...చీ చీ! అని మాత్రం అనగలిగింది గాని ఆపైన మన్మదుడనేదో, దేవుడనేదో? రెండవసారి ఉత్తరం చదవగానే శ్రీనాద్‌లాగే ఇందిర కూడా పెళ్ళికి ఒప్పేసుకుంది.

ఎందుకో ఇందిర, శ్రీనాద్‌లు ఒకర్నొకరు మునుపటిలా ఓరగా చూడ్డం, శ్రీనాద్ హావభావాలను ప్రదర్శించడం వంటివి చేయడంలేదు.

ఒక శుభ ముహూర్తాన వీళ్ళిద్దరూ ఉత్తరాల సంగతి తెలుసుకున్నారు. ఇద్దరిలో మూగ సంతోషం, అనిర్వచనీయమయిన ఆనందం. వాళ్ళ ఆనందాన్ని అప్పుడు విరబూసుకున్న అందాల్ని ముఖం చూస్తేనే చెప్పాలి కాని, మాటల్లో చెప్పలేము.

వాళ్ళిద్దరిని చూసేసరికి ప్రకృతికి కన్నుకుట్టుంది.

నిప్పు బూడిదయినట్టుగా, వాళ్ళలో వాళ్ళు ఏదో ఆకర్షణ లోపించినట్టుగా ఫీలయ్యారు.

రెండు మాసాల తర్వాత పెళ్ళి జరిగిపోయింది.

వాళ్ళ మొదటి రాత్రి ప్రళయంగా మారింది. నాకు రెండోనెల అని నవ్వుతూ ఇందిర అనగానే వెంటనే ఇందిర రాజారావుల ప్రణయం కళ్ళముందు ప్రత్యక్షమయింది. అతనిలోని మన్మధుడు మాయమయి ప్రళయకాల రుద్రుడు ప్రవేశించాడు. దీని సారాంశమే విడాకులు.

ఇందిర హృదయం అగ్నిజ్వాలల మాదిరిగా మండిపోయింది. చావును వెతుక్కుంటూ పోయింది! రాజారావు చావును అడ్డగించి ఇందిరను కాపాడాడు. నేను నిన్ను పెళ్ళిచేసుకుంటానని అన్నాడు. ఆమెని కాగిట్లో చేర్చుకున్నాడు. ఇందిర రాజారావుల ప్రణయం, రతీ మన్మదుల్ని మెరిపించింది!

శ్రీనాద్ ఏమయినా తక్కువవాడా? తన బుద్ధిమాద్యంవల్ల ఇందిరను అర్ధం చేసుకుని, దూరం చేసుకున్నాడు. ఇప్పుడు దేవదాసయ్యాడు.

అంతేకాదు. స్నేహితుల ప్రోద్బలంతో గోపాలక్రిష్ణుడయ్యాడు. మనసుని చంపుకుని వాంఛల్ని తీర్చుకుంటున్నాడు.

ఒకరోజు డాక్టర్ చెప్పాడు శ్రీనాద్‌తో, మీలో ఇప్పుడిప్పుడే లెప్రసి గుణాలు కనిపిస్తున్నాయని.

ఇందిర ప్రభావంవల్ల తను డాక్టర్ కాలేకపోయాడు. ఆక్టర్ అయ్యాడు. ఇందిరతో వివాహం ఒక ఆక్టింగ్‌లా భావించి మరచిపోయాడు.